క్లుప్తంగా

విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ


పరీక్ష సామగ్రితో విద్యార్థినులు

టెక్కలి రూరల్: టెక్కలి అభయం యువజన సేవాసంఘం ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వెనుక ఉన్న సమీకృత బాలికల వసతిగృహంలోని పదో తరగతి విద్యార్థినులు 57 మందికి పరీక్ష సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. మెళియాపుట్టి మండలంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న జన్ని ధర్మారావు పరీక్షలకు ఉపయోగపడేలా అట్ట, పెన్ను, పెన్సిల్, స్కేల్, బిస్కెట్ ప్యాకెట్లతో ఉన్న కిట్లను అందజేశారు. వార్డెన్ విజయలక్ష్మి, యువజన సంఘం అధ్యక్షులు డి.శ్రీనివాస్ ఉన్నారు.

ఆకట్టుకున్న 'వెలుగు రేఖలు'


నాటికలోని ఓ సన్నివేశం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని గుళ్లలపాడు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరాలయం 67వ వార్షికోత్సవం, శివరాత్రి మహోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి ప్రదర్శించిన వెలుగు రేఖలు సందేశాత్మక నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అమ్మవార్లకు మూగ జీవాలను బలి ఇవ్వడం కాదని సమాజానికి హాని కలిగించే చీడపురుగులను బలిస్తే సమాజం బాగుపడుతుందన్న ఇతివృత్తంగా కళాకారులు ప్రదర్శించిన నాటకం ఆలోచింపజేసింది. సినీరచయిత, దర్శకుడు గూన అప్పారావు నిర్దేశకత్వంలో కళాకారులు దువ్వాడ హేమబాబు చౌదరి, జయరాం, జయక్రిష్ణ, బి.బాలక్రిష్ణ, శిష్టు రామక్రిష్ణ తదితరులు వారి నటనలతో అలరించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి.. జై


బలియాపుట్టుగలో సేంద్రియసాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయి సిబ్బంది

- సేంద్రియ పద్ధతిలో పలు పంటల సాగు
- కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్న ప్రజలు

కంచిలి: ప్రకృతి వ్యవసాయ విధానానికి రైతులు అలవాటుపడుతున్నారు. ఆరోగ్యానికి మేలు చేకూర్చుతుండడంతో ప్రజల్లో కూడా సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన పంట ఉత్పత్తులను వినియోగించాలనే అవగాహన పెరుగుతోంది. దీంతో ఆర్గానిక్ ఫార్మింగ్ వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ప్రజలు కూడా ఒక రూపాయి ఎక్కువైనా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన ఉత్పత్తులనే కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సోంపేట వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కమ్యూనిటీ నేచ్యురల్ ఫార్మింగ్ విధానం కొద్దిరోజులుగా జోరందుకుంది. ఈ విధానం వలన రసాయనిక ఎరువులు కొనుగోలు చేయకుండా, స్థానికంగా లభ్యమయ్యే వస్తువులతో మందుల తయారీ అనే కాన్సెప్ట్ వలన వ్యవసాయ ఖర్చులు ఆదా అవుతున్నాయి. కొద్దిపాటి పంట భూముల్ని సాగుచేసి జీవనం గడుపుతున్న రైతులు ఈ విధానంపై ఆసక్తి చూపిస్తున్నారు. కూరగాయల పంటలు సాగుచేసే వారు ఈ విధానాన్ని అవగాహన చేసుకుంటున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 28 గ్రామ సంఘాల్లో, ఐదు యూనిట్లలో 6,754 మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రకృతి వ్యవసాయానికి ఆకర్షితులైన 2250 మంది రైతులు 1550 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తున్నారు. వీరిలో 200 మంది రైతులు 165.75 ఎకరాల్లో విత్తనం తయారీ నుంచి సాగు చేస్తున్నారు. అలాగే నవధాన్యాలను కూడా 1550 ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఇళ్ల పెరడులో కూరగాయలు పంటలను వేసే కిచెన్ గార్డెన్స్ 1500 వరకు ఉన్నాయి. ఏటీఎం విధానంలో సుమారు 20 సెంట్లలో కూరగాయలు, దుంప జాతులు, ఆకు కూరలు సాగుచేసున్నారు. 50 మంది రైతులు ఏ గ్రేడ్ మోడల్ పద్ధతిలో పొలం గట్లపై కూడా ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు సాగు చేస్తూ..వాటిని విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు.


పాత్రపడలో సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


కంచిలి మండల కార్యాయం ఎదుట సేంద్రియ విధానంలో సాగు చేసిన కూరగాయలను విక్రయిస్తూ..

ఖర్చులు తగ్గుతున్నాయి



ప్రకృతి వ్యవసాయ విధనంలో వరిసాగు చేయడం వలన చాలా వరకు ఖర్చులు తగ్గుతున్నాయి. ఈ విధానంవైపు భవిష్యత్తులో ఎంతోమంది రైతులు మొగ్గుచూపే అవకాశం ఉంది.

– గెద్దం క్రిష్ణారావు, రైతు, అంపురం గ్రామం

ప్రకృతి వ్యవసాయమే మేలు



ప్రకృతి వ్యవసాయ విధానంతో ఎంతగానో ప్రయోజనాలు ఉన్నాయి. ఒక రైతుగా నా అనుభవంలో ఈ విధానం చేపట్టడం వలన పెట్టుబడులు చాలా వరకు తగ్గుతునాయి. పైగా ఈ ఉత్పత్తులు చక్కని ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. కిచెన్ గార్డెన్‌తో ఎంతో ప్రయోజనం పొందుతున్నారు.

– సీర కామరాజు, రైతు, గోకర్ణపురం, కంచిలి మండలం

సంపూర్ణ ఆరోగ్యం



సేంద్రియ సాగుపద్ధతిలో ఉపయోగించే ఉత్పత్తుల వలన సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చు. ఈ ఉత్పత్తులు ఉపయోగించిన వారు మళ్లీ వాటివైపే మొగ్గ చూపిస్తున్నారు. సోంపేట డివిజన్ పరిధిలో రైతులు రోజురోజుకు ఈ విధానం వైపు ఆకర్షితులౌతున్నారు.

– టి.శివానందం, ప్రకృతి వ్యవసాయ విధానం మండల యాంకర్

ట్రాఫిక్ అవస్థలు



టెక్కలి మండలం రావివలసలో బుధవారం ఏర్పడిన ట్రాఫిక్ వలయంలో మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. పెద్ద వాహనాలు అడ్డంగా రావడంతో పాటు రోడ్డు పైనే వాహనాలు పార్కింగ్ చేయడంతో సుమారు గంటకుపైగా రెండు వైపులా ట్రాఫిక్ ఇబ్బందులు చోటు చేసుకున్నాయి. ఒక వైపు ఎండ వేడిని తాళ లేక చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడ్డారు. కొంత సమయం తరువాత తోట మార్గంలో రాకపోకలు సాగించడంతో పాటు ద్విచక్ర వాహనాలను మరో చోట పార్కింగ్ చేయించడంతో సమస్య పరిష్కారమైంది. – టెక్కలి

ఆలయ ప్రతిష్ట



కవిటి మండలంలోని సహలాలపుట్టుగలో సత్తగుణి అమ్మవారి ఆలయ ప్రతిష్ట బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, లోకకళ్యాణార్థం హోమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, స్థానిక ప్రజాప్రతినిధులు శ్రీదేవి, రవిప్రధాన్, బద్దాయి మురళి తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. – కవిటి

ఊరంతా సంబరం



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మూడో పద్మనాభపురం గ్రామంలో గావు సంబరాన్ని బుధవారం వైభవంగా జరుపుకున్నారు. గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి ఊరంతా విందుభోజనాలు పెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల తదితర సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. – కాశీబుగ్గ

వీరబ్రహ్మేంద్రస్వామికి పూజలు

ఇచ్ఛాపురం: మహాశివరాత్రిని పురస్కరించుకొని ఇచ్ఛాపురం పట్టణంలోని కంచికాపరమేశ్వరి దేవాయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేశారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భగవద్గీత పంపిణీ


భగవద్గీత పారాయణం చేస్తున్న దృశ్యం

కవిటి: ప్రతిఒక్కరూ రోజు భగవద్గీత పారాయణం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు ఏకాగ్రత సాధించవచ్చని దక్షిణభారత హిందీ ప్రచార సభ ప్రచారక్ నిరంజన్ ఖడంగా అన్నారు. జగతి, బొరివంక గ్రామాల్లోని వివిధ ఆలయాలకు వచ్చిన 78 మంది భక్తులకు భగవద్గీత పుస్తకాలను నూరు రామారావు సహకారంతో బుధవారం పంపిణీ చేశారు. భగవద్గీత పారాయణం చేసే విధానాన్ని వివరించారు. మానసిక సంఘర్షణతో కొట్టుమిట్టాడుతున్న వారందరికీ సమస్యల నుంచి బయటపడే శక్తి భగవద్గీత పారాయణవల్ల సులువుగా అవగతమవుతాయని నిరంజన్‌ఖడంగా అన్నారు.

మృత్యుంజయ యాగం



కంచిలి మండలం మండపల్లి గ్రామంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో మహామృత్యుంజయ యాగాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో 121 మంది దంపతులతో 121 హోమగుండాలతో యాగ పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. – కంచిలి

తత్ ప్రణమామి సదా శివలింగం..

మహా శివరాత్రి సందర్భంగా ఊరూరా ఆధ్యాత్మికశోభ నెలకుంది. బుధవారం తెల్లవారుజాము నుంచే శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలన్నీ శివ నామస్మరణతో మారుమ్రోగాయి. శివుడికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు, విశేష అర్చనలు, లింగోద్భవం చేశారు. స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేయగా.. స్వచ్ఛంద సంస్థలు ప్రసాదాలను పంపిణీ చేశారు. టెక్కలి మండలం రావివలసలోని ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆలయ కార్య నిర్వహణాధికారి జి.గురునాథరావు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్ వర్క్


టెక్కలి: రావివలస మల్లన్న ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ


టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీలోని ఉమా రామలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కవిటిలో పూజలందుకుంటున్న చంద్రశేఖర స్వామివారు


కంచిలి: కత్తివరం శివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు


కవిటి: ముత్యాలపేట మృత్యుంజయేశ్వరుని దర్శనానికి బారులుతీరిన భక్తులు


సంతబొమ్మాళి: మూలపేట ముక్తేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు


కంచిలి: జలంత్రకోటలో నీలకంఠేశ్వర స్వామికి పూజలు చేస్తున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తదితరులు


ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు శివాలయానికి అమృత కలశాలు తీసుకువెళ్తున్న భక్తులు


ఇచ్ఛాపురం రూరల్: కొఠారీ శివాలయంలో శివయ్యను దర్శించుకుంటున్న భక్తులు


ఇచ్ఛాపురం: నర్మదేశ్వరాలయంలో శివలింగానికి ప్రత్యేక అభిషేకం చేస్తున్న అర్చకులు


ఇచ్ఛాపురం: చిదంబరేశ్వరాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


కాశీబుగ్గ: పలాస నెమలికొండపై క్యూకట్టిన జనం


కాశీబుగ్గ: బస్టాండ్ వద్ద మానవహక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు


సోంపేట: పాలవలసలోని క్షీరరామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబసభ్యులు


సోంపేట: బారువ కోటిలింగేశ్వర స్వామిదేవాలయం వద్ద క్యూలైన్లో భక్తులు


టెక్కలి రూరల్: చంద్రశేఖర స్వామి దేవాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న భక్తజనం


నందిగాం: ఉమా అగస్త్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


వజ్రపుకొత్తూరు: బెండి నందికేశ్వరాలయంలో పోటెత్తిన భక్తులు


వజ్రపుకొత్తూరు రూరల్:కిడిసింగి శివాలయం వద్ద బారులుదీరిన భక్తులు


వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపలి నీలకంఠేశ్వరాలయం వద్ద మజ్జిగ పంపిణి చేస్తున్న మహిళలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

- నేడు ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభం
- టెక్కలి డివిజన్‌లోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 1053 మంది ఓటర్లు
- వివరాలు వెల్లడించిన ఆర్డీవో కృష్ణమూర్తి


ఎన్నికల అధికారులు, పోలీసులకు దిశా నిర్దేశం చేస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరగనున్న పోలింగ్‌కు టెక్కలి డివిజన్ పరిధిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, పాతపట్నం, ఎల్.ఎన్.పేట, సారవకోట, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం మండలాల పరిధిలోని తొమ్మిది పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మొత్తం 1053 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజినల్ అధికారి ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి, పోలీసులకు దిశా నిర్దేశం చేసి మెటిరీయల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిబంధనల ప్రకారం ఓటింగ్ జరిగే విధంగా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పోలీస్ సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాల్లోనికి వెళ్లవద్దని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పగడ్బందీగా బందోబస్తు నిర్వహించే విధంగా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో రహస్య ఓటింగ్ జరగాలని స్పష్టం చేశారు. ప్రతీ రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని తెలియజేయాలని ఎన్నికల సిబ్బందిన ఆదేశించారు. పోలింగ్ సమయంలో భోజన విరామం లేదని.. విధులు చేపడుతున్న వారిలో ప్రత్యామ్నాయ పద్ధతిలో భోజనాలకు వెళ్లాలని సూచించారు. సాయంత్రం నాలుగు గంటలకు ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఆయా బ్యాలెట్ బాక్సులను పోలీసుల భద్రత మధ్య టెక్కలి ఆర్డీవో కార్యాలయానికి తరలించాలన్నారు. ఇక్కడ నుంచి విశాఖపట్టణం ఆంధ్రా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రోర్ రూమ్‌కు తరలిస్తామని ఆర్డీవో చెప్పారు. టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, తొమ్మిది మంది ఎస్ఐలతో కలిపి మొత్తం 70 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

మండలాల వారీగా ఉపాధ్యాయ ఓటర్లు.. కేటాయించిన పోలింగ్ కేంద్రం వివరాలు ఇలా..

- టెక్కలి మండలంలో 254 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని కేటాయించారు. కోటబొమ్మాళి మండలంలో 112 మంది ఓటర్లు ఉండగా.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సంతబొమ్మాళిలో 52 మంది ఓటర్లు ఉండగా మండల కేంద్రంలోని ఎంపీయూపీ పాఠశాలలో కేంద్రాన్ని, పాతపట్నంలో 270 మంది ఓటర్లు ఉండగా.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాన్ని కేటాయించారు. మెళియాపుట్టిలో 99 మంది ఓటర్లకు చాపర జెడ్పీహెచ్ఎస్‌లో, ఎల్ఎన్.పేటలోని 27 మందికి మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్, కొత్తూరులో 103 మంది ఉండగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, హిరమండలంలో 70 మంది ఓటర్లు ఉండగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సారవకోటలో 66 మంది ఓటర్లు ఉండగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో కృష్ణమూర్తి వివరించారు.

పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి సిబ్బంది బుధవారం చేరకున్నారు. గురువారం జరగనున్న ఎన్నికలో 94 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.


కవిటి: పోలింగ్ కేంద్రంలో సామగ్రితో సిబ్బంది

- నందిగాం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ బూత్‌లో 98 మంది ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు.
- కంచిలి: మండల కేంద్రం కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు.
- వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులోని పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ సీతారామయ్య, ఎస్ఐ నీహర్ పరిశీలించారు. కేంద్రానికి చేరుకున్న సిబ్బందితో అధికారులు మాట్లాడారు.


నందిగాం: పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సోమేశ్వరరావు


కంచిలి: పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది


వజ్రపుకొత్తూరు రూరల్: ఎన్నికల కేంద్రానికి చేరిన సిబ్బంది